

విజయనగరం: ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు

- చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
- వెలవెలబోయిన విజయనగరం.. పల్లె బాట పట్టిన జనం
- గజపతినగరంలో పోలింగ్ అధికారిపై వైసీపీ ఏజెంట్ల దాడి
- భోజరాజపురంలో ఎన్నికల బహిష్కరణ
- నెల్లిమర్ల మండలంలో మహిళా ఓటరు మృతి
- చాలా చోట్ల మొరాయించిన ఈవీఎంలు



విజయనగరం: కొత్తపేట కుమ్మరివీధిలో బారులుతీరిన ఓటర్లు



ఓటు వేసిన ఎస్పీ దీపిక

ఈవీఎంలలో తీర్పు

ఎన్నికల ప్రహసనంలో కీలక దశగా చెప్పుకునే పోలింగ్ ముగిసింది. ప్రజలు ఇచ్చిన తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. సోమవారం ఉదయం 7 గంటలకు నెమ్మదిగా మొదలైన ఓటింగ్ క్రమేపీ పెరిగింది. సాయంత్రానికి కూడా ఓటర్లు బారులుతీరి కనిపించారు. నిర్దేశించిన సమయం ముగిసేటప్పటికి క్యూలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించడంతో అనేక పోలింగ్ బూత్‌లలో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ సాగింది. జిల్లా అంతటా ఎక్కడికక్కడే ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఓటర్లు క్యూలో ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వచ్చింది. గజపతినగరంలో పోలింగ్ అధికారిపై వైసీపీ ఏజెంట్లు దాడి చేశారు. ఇది మినహాయిస్తే చెదురుమదురు ఘటనలతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈసారి మహిళలు అధికంగా ఓటు వేసేందుకు ఆసక్తి చూపారు. నగరంలోని ఓటర్లంతా పల్లెబాట పట్టడంతో సోమవారం విజయనగరం వెలవెలబోయింది.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కార్యకర్తలపై దాడి..

విజయనగరం క్రైమ్: నగరంలోని ఉల్లివీధి జంక్షన్‌లో టీడీపీకి చెందిన విజయకృష్ణ, సత్యనారాయణపై వైసీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. వీరంతా స్థానిక కార్పొరేటరు కేదారశెట్టి సీతారామ మూర్తి (రామపండు) అనుచరులు. మూకుమ్మడిగా దాడి చేసి కొట్టారు. ఫొటోలు తీసిన ఆంధ్రజ్యోతి విలేకర్లను బెదిరించారు. సెల్‌ఫోన్ లాక్కొని ఫొటోలను బలవంతంగా డిలీట్ చేయించారు.

పీవోపై వైసీపీ ఏజెంట్ల దాడి..

గజపతినగరం: ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీవో)పై వైసీపీ ఏజెంట్లు దాడి చేశారు. కొత్తశ్రీరంగరాజపురం గ్రామంలోని 100వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఓటరును ప్రలోభ పెట్టి సైకిల్ గుర్తుపై ఓటు వేయించాడంటూ పీవోపై దాడి చేశారు. ఈ ఘటనతో అరగంట పాటు పోలింగ్ నిలిచిపోయింది.

కొత్తశ్రీరంగరాజపురం గ్రామంలోని ఎన్నికల బూత్‌కు పీవోగా వి.రాంబాబు వ్యవహరిస్తున్నారు. గ్రామానికి చెందిన యిజ్జిరోతు సూరమ్మ తన మనవడితో సోమవారం ఓటు వేయడానికి కేంద్రానికి వచ్చారు. వృద్ధురాలు కావడంతో పీవో స్వయంగా ఆమెను ఈవీఎం వద్దకు తీసుకెళ్లి ఓటు వేయించారు. ఓటు వేసిన తరువాత ఈవీఎంలో సైకిల్ గుర్తు రావడాన్ని పక్కనే ఉన్న ఆమె మనవడు గుర్తించి ఏజెంట్‌లకు చెప్పాడు. వైసీపీకి ఓటు వేయాలని కోరితే టీడీపీకి వేయించాడన్నారు. ఆగ్రహించిన పోలింగ్ ఏజెంట్‌లు పీఓతో ఘర్షణకు దిగి పిడి గుద్దులుగుద్దారు. అంతలో టీడీపీ, వైసీపీ వర్గాలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకోవడంతో పోలింగ్ కొద్దిసేపు నిలిచిపోయింది. ఆర్వో ఎం.సూర్యకళ ఆదేశాల మేరకు పీవో రాంబాబును తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి కొత్త పీవోను పోలింగ్ కేంద్రానికి పంపారు. అనంతరం తిరిగి పోలింగ్ ప్రారంభమైంది.



పీవోపై దాడి చేస్తున్న వైసీపీ ఏజెంట్లు



విజయనగరం: జొన్నగుడ్డి పోలింగ్ స్టేషన్‌లో క్యూలో ఓటర్లు



ఓటు వేసేందుకు కలెక్టర్

పక్కిలో ఉద్రిక్తత..

బొబ్బిలి: బొబ్బిలి వైసీపీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు స్వగ్రామమైన పక్కిలో సోమవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసు బలగాలు మోహరించాయి. టీడీపీ ఏజెంట్‌పై దౌర్జన్యం చేసేందుకు కొంతమంది ప్రయత్నించగా డీఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నట్లు సమాచారం. పోలింగ్ సమయం ముగిసిన తరువాత ఘర్షణ వాతావరణం కనిపించింది. కాగా బొబ్బిలి మండలం జగన్నాథపురం గ్రామంలో క్యూలో తొక్కిసలాట జరగడంతో పలువురు మహిళలు గాయపడ్డారు.



ఎం.బూర్జివలసలో రాత్రి వేళ కూడా కొనసాగుతున్న ఓటర్ల క్యూ

బీఎల్ఓపై అభ్యంతరం..

బొబ్బిలి: బొబ్బిలి మండలం అలజంగి గ్రామంలో 41, 42 పోలింగ్ కేంద్రాలలో సోమవారం పోలింగ్‌ను పురస్కరించుకొని ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. బీఎల్ఓ పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్లు గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ స్పందించి బీఎల్ఓను అక్కడి నుంచి పంపించేశారు. కొద్ది సేపటి తర్వాత మళ్లీ గొడవ జరిగింది. అది ఘర్షణకు దారితీసింది. సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు సిబ్బందితో చేరుకొని రెండు వర్గాలను చెదరగొట్టారు. చింతాడ గ్రామంలోనూ ఇదేరకమైన ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు రావడంతో సద్దుమణిగింది.



అలజంగి పోలింగ్ కేంద్రం ముందు గొడవను అదుపు చేస్తున్న పోలీసులు

ఎన్నికల జాతర ముగిసింది. షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి మొదలైన హడావిడి పోలింగ్ వరకు ఉవ్వెత్తున సాగింది. సోమవారం నాటి ఓటింగ్ ప్రక్రియతో అంతా గప్‌చుప్ అయింది. పకడ్బందీ ఏర్పాట్లతో సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. ఈ సారి ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవీఎం) ఎక్కడికక్కడ మొరాయించాయి. మండు వేసవి కావడంతో ఉదయాన్నే ఓటు హక్కు వినియోగించుకునేందుకు చాలా మంది పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఈవీఎంలు మొరాయించడంతో ఎక్కువ సేపు నిరీక్షించాల్సి వచ్చింది. మంత్రికి కూడా తిప్పలు తప్పలేదు. విజయనగరంలోని ఎమ్ఆర్ కళాశాలలో 166వ పోలింగ్ స్టేషన్లో మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా ఓటు వేసేందుకు బయలుదేరారు. ఈవీఎంలు పనిచేయడం లేదని తెలిసి ఆయన ఇంటి వద్దే వేచి ఉన్నారు. నగరం లోని కేఎల్ పురం 23వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. గుర్ల మండలం నడుకూరు, కెల్ల, దమరసింగి, పెదబంటుపల్లి కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. జిల్లా అంతటా ఈ సమస్య తలెత్తింది. కాగా నిత్యం జనా లతో కిటికిటలాడే విజయనగరం రోడ్లు నిర్మానుష్యంగా కన్పించాయి. జనం పల్లెలకు వెళ్లడం.. షాపులన్నీ మూసివేయడం.. ఆర్టీసీ బస్సులు పెద్దగా తిరగకపోవడం.. వెరసి పట్టణం నిర్మానుష్యంగా మారింది.

పోలింగ్ సరళి ఇలా..

జిల్లాలో పోలింగ్ మందకొడిగా ప్రారంభమై 12 గంటల వరకు బాగానే సాగింది. తరువాత ఎండ తీవ్రత కారణంగా నెమ్మదించింది. నాలుగు గంటల తరువాత మళ్లీ ఊపందుకుంది. ఉదయం 9గంటలకు 10.65 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటలకు 70.87 శాతం నమోదైంది. ఆ తర్వాత మరింత పెరిగింది. కాగా గుర్ల, మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ సాగింది. జిల్లాలో కొన్నిచోట్ల వర్షం పడింది. ఈదురుగాలులు వీచాయి. ఈ కారణంగా ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిన కారణంగా సెల్ టార్చ్‌లైట్ వెలుతురులో కొంతమంది ఓట్లు వేశారు. గజపతినగరం మండల శివారు గ్రామాల్లో ఈ పరిస్థితి ఏర్పడింది. విజయనగరం చిన్నవీధి కూడలి వద్ద టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకులు చేయి చేసుకున్నారు. ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఫొటోలు తీసిన విలేకరులను బెదిరించారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు..

పోలింగ్ పూర్తి చేసిన తరువాత ఈవీఎంలను జెఎన్‌టీయూ, లెండి ఇంజినీరింగ్ కళాశాలలకు చేర్చారు. రిసెప్షెన్ సెంటర్లు ఏర్పాటు చేసి స్వీకరించారు. వచ్చేనెల 4న జరిగే ఓట్ల లెక్కింపు వరకు ఈవీఎంలు ఇక్కడే భద్రపరుస్తారు. జెఎన్‌టీయూలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గ ఈవీఎంలు ఉండగా.. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, ఎస్.కోట, గజపతినగరం నియోజక వర్గాల ఈవీఎంలను భద్రపర్చారు.

మహిళలే తేల్చేది...

జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతాన్ని గమనిస్తే ఈ ఎన్నికల్లో 79.95శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 15,62,921 మంది ఓటర్లకు గాను 11,87,113 మంది ఓటేశారు. ఇందులో మహిళలే అత్యధికంగా ఉన్నారు. పురుషులు 74.97 శాతం, మహిళలు 76.92 శాతం మంది ఓటేశారు. గత 2014, 2019 ఎన్నికల పోలింగ్ శాతాన్ని గమనిస్తే 2014లో 80శాతం మంది, 2019లో 80.67 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇపుడు ఓటింగ్ శాతం పెరిగింది.

ఈవీఎంల మొరాయింపు

విజయనగరం (ఆంధ్రజ్యోతి) మే 13: జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. ఉదయం 6గంటలకే ప్రారంభం కావాల్సిన పోలింగ్ గంటల తరబడి ఆలస్యమైంది. గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో 8గంటల వరకు పోలింగ్ మొదలు కాలేదు. అలాగే రాత్రి 8 గంటలు దాటిన తరువాత కూడా వర్షంలో నిల్చొని ఇబ్బందులు పడుతూ ఓటేశారు. డెంకాడ, జామి, బాడంగి, రాజాం, భోగాపురం తదితర మండలాల్లోనూ ఈవీఎంలు మొరాయించాయి.



విజయనగరం: చక్రాల చైర్‌లో



ఎన్నికలను బహిష్కరించిన భోజరాజపురం గ్రామస్థులు

ఎన్నికల బహిష్కరణ..

దత్తిరాజేరు: భోజరాజపురం గ్రామస్థులు ఎన్నికలను బహిష్కరించారు. తమ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి లేదని, నాయకులు హామీలు ఇవ్వడమే తప్ప పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మేమంతా ఎన్నికలను బహిష్కరిస్తున్నామన్నారు. గ్రామంలో 205 మంది ఓటర్లు ఉన్నారు.

ఓటు వేసేందుకు వచ్చి... తుది శ్వాస విడిచి

నెల్లిమర్ల: ఓటు వేసేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు పోలింగ్ కేంద్రంలోనే మృతి చెందిన ఘటన నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఉదయం 8.30 గంటల సమయంలో ఓటు వేసేందుకు ఆ గ్రామానికి చెందిన పాలూరి పెంటమ్మ(65) పోలింగ్ కేంద్రానికి వచ్చింది. క్యూలో నిల్చుని అకస్మాత్తుగా కుప్పకూలినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. 108 వాహనానికి సమాచారం ఇచ్చి వారిని రప్పించారు. ఆ వాహన సిబ్బంది ఆమెను పరీక్షించి అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు.



పాలూరి పెంటమ్మ (ఫైల్)



ఓటు వేసిన అశోక్ కుటుంబ సభ్యులు



మెంటాడలో సెల్ వెలుగులో ఓటు



ఎస్.కోట రూరల్: ఓటేసేందుకు వృద్ధురాలు

పోలింగ్‌కు బస్సులు.. ప్రయాణానికి అగచాట్లు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన వలస ఓటర్లకు సోమవారం కూడా తిప్పలు తప్పలేదు. బస్సులు లేక ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్‌ల్లో ప్రయాణించాల్సి వచ్చింది. ఎలాగైనా ఓటుహక్కును వినియోగించుకోవాలన్న సంకల్పంతో ఎక్కడెక్కడి నుంచో సొంత ప్రాంతానికి వచ్చారు. విజయనగరం కాంప్లెక్స్‌లో చాలాసేపు నిరీక్షించి ఇబ్బందులు పడ్డారు. 110 బస్సుల వరకు ఎన్నికల విధులకు కేటాయించటంతో ఓటేసేందుకు వచ్చిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు కోసం పరుగు



విజయనగరం సంగీత కళాశాలలో ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు


నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
విజయనగరం (ఎంపీ):	15,62,921	12,18,730	77.98
విజయనగరం (అసెంబ్లీ)	2,57,205	1,82,245	70.86
రాజాం (ఎస్సీ)	2,27,503	1,70,146	74.79
బొబ్బిలి	2,31,232	1,82,106	78.75
చీపురుపల్లి	2,05,484	1,65,525	80.55
గజపతినగరం	2,05,471	1,70,394	82.93
నెల్లిమర్ల	2,13,551	1,68,885	79.08
ఎస్.కోట	2,22,475	1,79,429	80.65

దిక్సూచి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.



మహా సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ

హై సీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్లు)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. అదీ కాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాదికారితన 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిస్‌డిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.(ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవెల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.

బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ధి చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్గ్రహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఐఐఎఫ్‌టీ
ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐహెచ్ఎంలో డిప్లొమా

హాజీపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

విభాగాలు-సీట్లు: ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెబ్‌సైట్: ihmhajipur.net

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/PRJDZZDలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి






క్యూలో నిల్చుని ఓటేసిన సినీ ప్రముఖులు

సోమవారం హైదరాబాద్‌లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో సినీ ప్రముఖులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాధారణ జనంతో పాటు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూ లైన్లలో నిలబడి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. మెగాస్టార్ చిరంజీవి, మోహన్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, కల్యాణ్‌రామ్, డాక్టర్ రాజశేఖర్, నాని, నాగచైతన్య, విజయ్ దేవరకొండ.. ఒకరనేమిటి అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'మీరు కూడా ఓటు వేయండ'ంటూ పిలుపునిచ్చారు.







మాతృభాషలోనూ డబ్బింగ్

దక్షిణాది అభిమానులే కాక ఉత్తరాది ప్రేక్షకలోకం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 27న ఈ చిత్రం విడుదల కానుండడంతో చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసింది. ఇటీవలే ఈ మూవీలో తన పాత్ర కోసం దీపికా డబ్బింగ్ మొదలుపెట్టారు. ఆ పాత్ర డబ్బింగ్‌ను హిందీలోనే కాకుండా తన మాతృభాష అయిన కన్నడలోనూ దీపికానే స్వయంగా చెప్పుకోవడం విశేషం. తన మాతృభాషలో డబ్బింగ్‌కు దీపికానే వాయిస్ అందించడంతో ఇది మూవీకి మరింత ప్లస్ కానుంది అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





కేన్స్ చిత్రోత్సవంలో టీజర్ లాంచ్

మంచు విష్ణు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. ఇందుకు తగ్గట్లే ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ విషయంలో చిత్ర బృందం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విడుదల చేయబోతున్నారు. 'వరల్డ్ ఆఫ్ కన్నప్ప' పేరుతో రిలీజ్ కానున్న ఈ టీజర్ ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. కాగా, ఈ భారీ బడ్జెట్ ఫ్యాంటసీ డ్రామాను ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌బాబు, శరత్‌కుమార్, శివ రాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్ లాల్, ప్రభుదేవా వంటి స్టార్స్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

నటిస్తూ వేదికపై కుప్పకూలిన నటుడు



జీవితంలో చివరి క్షణం వరకూ నటిస్తూ ఉండాలని చాలా మంది చెబుతుంటారు. అది మరాఠి నటుడు సతీశ్ జోషి విషయంలో నిజమైంది. ఆదివారం ఆయన ముంబైలో రంగోత్సవ్ కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తూ ఉన్నట్లుండి వేదికపై కుప్పకూలారు. 'ఉదయం నుంచి సతీశ్ అలసటతో కనిపించారు. వేదికపై కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆయన కింద పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.' అని సతీశ్ సన్నిహిత మిత్రుడు, సహ నటుడు రాజేశ్ దేశ్‌పాండే చెప్పారు. మరాఠి నాటకాలు, టీవీ సీరియల్స్, సినిమాల ద్వారా సతీశ్ చిరపరిచితుడు. ఆయన మరణంతో ఓ ప్రతిభాశాలిని మరాఠి చిత్ర పరిశ్రమ కోల్పోయిందని చెప్పాలి.


బొబ్బిలి: ఓటేసిన బేబీనాయన సోదరులు


భోగాపురంలో ఓటేసిన నాగమాధవి


రాజాం: ఓటేసిన కోండ్రు


ఎల్‌కోట: ఓటేసిన కోళ్ల లలితకుమారి


చీపురుపల్లి: పోలింగ్ స్టేషన్ల పరిశీలనలో కళా..


ఓటేసిన కే శ్రీనివాస్


ఓటేసిన నాగార్జున


కొత్తవలసలో పోలింగ్ కేంద్రానికి వచ్చిన శ్రీభరత్

ఓటెత్తారు..

- ప్రశాంతంగా పోలింగ్
- భారీగా తరలివచ్చిన వృద్ధులు, మహిళలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అన్ని చోట్ల ఆరుగంటలకే ముగిసిపోగా కొన్ని చోట్ల రాత్రి పదకొండు గంటల దాకా కొనసాగాయి. మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో బారులు తీరగా అధికారులు పక్కా ఏర్పాట్లతో ఎన్నికల ప్రక్రియను కొనసాగించారు. ఉన్నతాధికారులు, ఎన్నికల పరిశీలకులు ఎప్పటికప్పుడు పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎక్కడా ఎటువంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


గజపతినగరం: పురిటిపెంటలో ఓటేసిన కొత్త ఓటర్లు


భోగాపురం: అప్పన్నపేటలో వేచి వేస్తున్న ఓటర్లు..


డెంకాడ: క్యూలో ఉన్న ఓటర్లు

వృద్ధులను తీసుకొస్తూ..


నెల్లిమర్లలో..


తెర్లాంలో మంచంపై మోసుకొస్తూ..


వంగరలో..


పూసపాటిరేగ: స్పృహ తప్పిన మహిళకు సపర్యలు


బొండపల్లి: దేవుపల్లి పోలింగ్ బూత్ వద్ద వర్షంలో..


గరివిడిలో ఓటు వేయడానికి క్యూలో..


బొబ్బిలిలో వృద్ధురాలిని మోసుకొస్తున్న పోలీస్


ఎస్.కోట: చింతబడి పోలింగ్ బూత్ వద్ద..


రేగిడి: కోడిశలో క్యూలో ఓటర్లు


తెర్లాం: పోలింగ్ కేంద్రంలో ఎన్నికల పరిశీలకులు


రాజాంలో ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధురాలు


బాడంగి: పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలిశెట్టి

మహిళల బారులు..


రామభద్రపురంలో..


జామి: జాగరంలో వర్షంలో మహిళలు..

పార్వతీపురం మన్యం జిల్లాలో..


ఓటేసిన జగదీశ్వరి


ఓటేసిన విజయచంద్ర దంపతులు


ఓటేసిన జయకృష్ణ


ఓటేసిన సంధ్యారాణి


సాలూరు మండలంలో బారులు తీరిన ఓటర్లు


మక్కువలో ఓటర్లు ఇలా..


పార్వతీపురంలో ఓటు వేసిన కలెక్టర్ దంపతులు


బలిజిపేట: పోలింగ్ బూత్ వద్ద నిల్చున్న ఓటర్లు


సీతంపేట: సోమగండి పోలింగ్ కేంద్రం వద్ద..


జియ్యమ్మవలస: పోలింగ్ కేంద్రం వద్ద ఏఎస్పీ దిలీప్‌కిరణ్


పాచిపెంటలో భారీ క్యూ


సాలూరు: ఈవీఎంకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


సీతానగరంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్


పాలకొండ: క్యూ లైన్లలో..

పోలింగ్ ప్రశాంతం

- అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- సాయంత్రం వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం
- కొన్నిచోట్ల తాగునీరు, టెంట్లు లేక ఓటర్ల అవస్థలు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. సాయంత్రం వర్షం కురవడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో టార్చ్ లైట్ల వెలుగులో పోలింగ్ ప్రక్రియ ముగించాల్సి వచ్చింది.

మొరాయించిన ఈవీఎంలు

గుర్ల: మండలంలో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. పెదబంటుపల్లిలో ఈవీఎం అరగం టపాటు మొరాయించింది. కెల్ల గ్రామంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. నడుపూరులో సాయంత్రం వరకు ఈవీఎంలు పనిచేయలేదు. చాలా చోట్ల విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడం, ఇంకో వైపు వర్షం, గాలి వీయడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి 7 గంటల వరకు క్యూలైన్‌లో ఓటర్లు నిల్చున్నారు. కాగా, రౌతుపేట గ్రామంలో ఓ వృద్ధురాలి ఓటు కోసం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కొన్ని చోట్ల పోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కొంతసేపు గందర గోళం ఏర్పడింది. వర్షం రావడంతో టెంట్లు కూడా పడిపోయాయి. ● **దత్తిరాజేరు:** మండలంలోని దత్తి, ఎం.లింగావలస, ఎస్.చిం తలవలస గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కొంతసేపు ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ● **వంగర:** పటువర్ధనం, బాగెమ్మపేట, నీలయ్యవలస, సీతారాంపురంలో ఈవీఎంలు మొరాయించాయి. ఇంజనీరింగ్ సిబ్బంది వచ్చి ఈవీఎంలు మార్చారు. పటువర్ధనం, అరసాడ, కోనంగిపాడు, కొండచాకరాపల్లిలో చిన్నపాటి వివాదాలు తలెత్తగా పోలీసులు అదుపు చేశారు. ● **బొబ్బిలి:** పట్టణంలోని తారకరామా కాలనీ, మల్లమ్మపేట, మండలంలోని గొర్లె సీతారాంపురం, దిబ్బగుడ్డివలస తదితర పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించాయి. సుమారు గంటకు పైగా ఈవీఎంలు పని చేయకపోవడంతో అప్పటికే క్యూలైన్‌లో ఉన్న ఓటర్లంతా తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సాంకేతిక సిబ్బంది వచ్చి వాటిని సరిచేశారు. దివ్యాంగులైన ఓటర్లకు వీల్ చైర్లను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ● **రామభద్రపురం:** కొండకెంగువలోని 138వ పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం మొరాయించడంతో సుమారు గంటన్నర సేపు పోలింగ్ నిలిపివేశారు. ఓటింగ్ ఆలస్యమైంది. రామభద్రపురం, ఆరికతోట, రొంపల్లి, కొట్టక్కి గ్రామాల్లో వర్షం పడడం.. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందుకు గురయ్యారు. ● **బాడంగి:** ముగడలోని పోలింగ్ బూత్ 181లో ఈవీఎంలు పలుమార్లు మొరాయించాయి. దీంతో 9 గంటల వరకు ఓటింగ్ జరగక మహిళలు నిరీక్షించారు. ఎట్టకేలకు 12 గంటలకు సాంకేతిక సిబ్బంది ఈవీఎంను సరిచేశారు. 12 గంటల నుంచి ఓటింగ్ మొదలైంది. అప్పటికే అనేక మంది వెనుదిరిగారు. ఆనవరం, గజరాయని వలస, రేజేరు, గొల్లాది, కోడూరు తదితర గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.

వృద్ధులు కాకపోయినా వీల్‌చైర్లపై..

కొత్తవలస: కొత్తవలస మండలంలోని వివిధ గ్రామాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రామలింగపురంలో దివ్యాంగులు, వృద్ధులు కాకపోయినా కొంతమందిని వీల్‌చైర్లలో తీసుకొచ్చి ఓట్లు వేయిస్తున్నారని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ స్థానిక వీర్వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, టీడీపీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ పోలింగ్ సమయం ముగిసే వరకు కేంద్రాలకు దగ్గరలోనే ఉన్నారు. సంతపాలెంలో కొద్దిసేపు ఈవీఎం మొరాయించడంతో సాంకేతిక సిబ్బంది వచ్చి సరిచేశారు. కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను మంత్రి బొత్స సత్యనారాయణ, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు. చింతలపాలెం గొల్లపేట వద్దనున్న పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఓట్లు వేయించడంలో నిర్లక్ష్యం వహించడంతో మందకొడిగా ఓటింగ్ జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు వచ్చిన వారు సాయంత్రం 4 గంటలైనా క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. కొత్తవలస పంచాయతీ చింతల దిమ్మ ప్రాంతంలోని పోలింగ్ బూత్ వద్ద టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు వచ్చి ఇరువర్గాల వారిని చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది.

రాజాంలో పోలింగ్ జాప్యం

రాజాం/రూరల్: రాజాం నియోజకవర్గంలో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రారంభంలో జాప్యం చోటు చేసుకుంది. ఒమ్మి పోలింగ్ కేంద్రంలో చోటు చేసుకున్న చిన్నపాటి వివాదం కొట్లాటకు దారి తీసింది. వైసీపీ శ్రేణుల దాడిలో టీడీపీ విజయనగరం జిల్లా అధికార ప్రతినిధి, స్థానిక సర్పంచి వంగా వెంకటరావు గాయపడ్డారు. ఎన్నికల విధులకు హాజరైన రిజర్వ్‌డ్‌లో ఉన్న విజయనగరానికి చెందిన ఉద్యోగి రమణ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం కుప్పకూలిపోయారు. చికిత్స కోసం ఆయనను విజయనగరం తరలించారు. అంతకా పల్లి పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కొండంపేటలోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు పని చేయకపోవడంతో ఉదయం 9.50 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఉదయం 7.30 గంటల వరకూ పోలింగ్ ప్రారంభం కాలేదు. పెనుబాక ఎస్సీ కాలనీలోని పోలింగ్ కేంద్రంలో రెండు గంటల పాటు పోలింగ్ ప్రారంభంలో జాప్యం జరిగింది. ఈవీఎంలు పని చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. వివిధ పోలింగ్ కేంద్రాలలో విద్యుదీకరణ సరిగ్గా లేకపోవడంతో ఈవీఎంలలోని గుర్తులు సరిగ్గా కనిపించలేదని ఓటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోనే సీనియర్ ఓటరుగా గుర్తింపు పొందిన 104 ఏళ్ల గున్నరాజమ్మ రాజాంలోని పోలీస్‌స్టేషన్ పాఠశాలలో తన ఓటును వేశారు. 85 ఏళ్ల తన కుమారుడు, మనుమడితో కలిసి ఆమె ఓటు వేసేందుకు ఆమె పోలింగ్ కేంద్రానికి వీల్‌చైర్‌లో వచ్చారు.

జాబితాలో కానరాని ఓట్లు

గంట్యాడ: మండలంలోని పలు గ్రామాల్లో కొంతమంది ఓటర్లకు జాబితాలో ఓటు లేకపోవడంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గంట్యాడ గ్రామానికి చెందిన పిణగం సత్యనారాయణ అనే వృద్ధుడు స్థానిక పోలింగ్ కేంద్రానికి వెళ్లగా, జాబితాలో ఆయన పేరు లేదని చెప్పారు. దీంతో ఆయన కాసేపు నిరసన వ్యక్తం చేశాడు. అలాగే సిరిపురం, నరవ, పెదవేమలి గ్రామాల్లో పలువురికి జాబితాలో పేర్లు లేకపోవడంతో పోలింగ్ కేంద్రాల నుంచి వెనుతిరిగారు.



భోగాపురం: గాబువానిపేటలో పోలింగు బూత్ ముందు గుమికూడిన ఓటర్లు



నెల్లిమర్ల: బూరాడపేటలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

గాబువానిపేటలో తీవ్ర అసంతృప్తి

భోగాపురం: ముంజేరు పంచాయతీ గాబువానిపేట పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ ఒకే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయడంతో స్త్రీలు, పురుషులు కొంత సమయం ఇబ్బందులకు గురయ్యారు. అక్కడ ఉన్న పోలీసు ఓటర్లపై దురుసుగా ప్రవర్తించడంతో కొంతమంది ఓటు వేయకుండానే వెనుతిరిగారు. అలాగే ఈ పోలింగ్ బూత్ వద్ద కూలైన్‌లో అధిక సంఖ్యలో ఓటర్లు కిక్కిరిసి ఉండడంతో చాట్ల ఆదమ్మ అనే మహిళ స్పృహ కోల్పోయింది. స్థానికులు, హెల్త్ సిబ్బంది సుమారు 30 నిమిషాల పాటు సపర్యలు చేయడంతో ప్రమాదం తప్పింది. అదే బూత్ ముందు ఓ ఓటరు మద్యం తాగి, అక్కడే పడి ఉన్నా అతన్ని ఎవరూ పట్టించుకోలేదు. తీర ప్రాంత గ్రామాలైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు గ్రామాలకు చెందిన ఓటర్లు ఇతర గ్రామాల నుంచి రావడంతో ఆయా గ్రామాలు ట్రావెల్ బస్సులతో నిండుకున్నాయి. అయితే ఒక్కో పోలింగు బూత్ వద్ద ఒక్కో పోలీసు మాత్రమే ఉండడంతో 100 మీటర్ల తర్వాత ఉండాల్సిన కార్యకర్తలు బూత్‌ల పక్కనే ఉండి వారివారి ప్రచారాలు చేసుకున్నారు. అప్పన్నపేటలో ఈవీఎం పనిచేయక పోవడంతో ఉదయం 9గంటల వరకు 8 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అనంతరం ఈవీఎం పని చేసింది.

పలుచోట్ల పోలింగ్ ఆలస్యం

నెల్లిమర్ల: నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించాయి. సాయంత్రం 6గంటల తర్వాత కూడా జరజాపుపేట, సతివాడ, గుషిణి గ్రామాల్లో ఓటర్లు కిటకిటలాడడం కనిపించింది. ఉదయం 9 గంటలకు 7.51 శాతం నమోదు కాగా, 11 గంటలకు 19.37 శాతం, ఒంటి గంటకు 35.69 శాతం, 3 గంటలకు 50.52 శాతం, 4 గంటలకు 57.04 శాతం, సాయంత్రం 5 గంటలకు 69.49 శాతం, 6 గంటలకు 73.26 శాతం నమోదు అయింది. సాయంత్రం వర్షం కురవడంతో పోలింగ్ కేంద్రాల్లో అక్కడక్కడా విద్యుత్ సమస్య వల్ల పోలింగ్ ఆలస్యం అయిందని చెబుతున్నారు. మొత్తానికి నియోజకవర్గ పోలింగ్ శాతం 80 శాతానికి చేరే అవకాశాలు కనబడుతున్నాయి. ● **రేగిడి:** రేగిడి మండలంలో ఈవీఎంలు మొరాయింపుతో అప్పాపురం, బూరాడ, కోడిశ, జాడపేట, లచ్చరాయపురం, తునివాడలో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో సాయంత్రం 6 గంటలు దాటినా ఆరు పోలింగ్ కేంద్రాల్లో క్యూ కొనసాగింది. చిన్నపాటి ఘర్షణలు చోటుచేసుకొన్న సోమరాజుపేట, కొండవలస, వన్నలి తదితర పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ రాములమ్మ, ఎస్ఐ శ్రీనివాస్‌లు పరిశీలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, సునీలా, అదితి గజపతిరాజులు కంటోన్మెంట్ సెయింట్ మేరీస్ స్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అశోక్ భార్య సునీలా గజపతిరాజు స్వల్ప అస్వస్థతకు గురికావడంతో ఆమెను వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి కొంతదూరం తీసుకెళ్లారు. తరువాత సిబ్బంది వచ్చి ఆమెను పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యులంతా ఓటు హక్కును వినియో గించుకున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి ఝాన్సీ, కుటుంబ సభ్యులతో కలసి ఎమ్మార్ కళాశా లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ నాగల క్ష్మీ, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ కనపాక యూత్ హాస్టల్‌లో క్యూలో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ దీపిక తోటపాలెం పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరితో పాటు ఎమ్మెల్యే కోలగట్ల, టీడీపీ రెబల్ అభ్యర్థి మీసాల గీత, నాయకులు అవనాపు విజయ్ కుటుంబ సభ్యులతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కనపాక యూత్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి వెళ్లే రహదారి బురదమయంగా మారింది. నడిచి వెళ్లేందుకు కూడా దారి లేకపోవటంతో ఓటర్లు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.

బొబ్బిలిలో బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) స్థానిక తాండ్రపాపారాయ మున్సిపల్ పాఠశాలలో ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, బేబీనాయన పెద్దన్న సుజయ్‌కృష్ణరంగారావు, రెండో అన్న రామకృష్ణరంగారావులు కూడా సామాన్యుల మాదిరిగానే సుమారు గంట సేపు క్యూలైన్‌లో వేచి ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసి వచ్చిన తరువాత బేబీనాయన మాట్లాడుతూ భావి తరాల భవిష్యత్ పరిరక్షణకు ఓటు హక్కు దోహద పడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌డీఏ కూటమి పవనాలు బలంగా వీస్తున్నాయని, పెద్ద మెజారిటీతో అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు విలేకరులతో అన్నారు.

ఖాశాపేటలో కోళ్ల

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గ కూటమి అభ్యర్థి కోళ్ల లలితకుమారి తమ ఓటు హక్కును తన స్వగ్రామం ఖాశాపేటలో వినియోగించుకున్నారు.

రాష్ట్రంలో మార్పు కోసమే..

గంట్యాడ: కూటమి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ తన ఓటు హక్కును గంట్యాడ గ్రామంలో వినియోగించుకున్నారు. రాష్ట్రంలో మార్పు కోరుకోవడం కోసం పెద్దఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి, తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని అన్నారు.



దత్తిరాజేరులో..



చీపురుపల్లిలో..



గరివిడి: వెదుళ్లవలసలో..



పూసపాటిరేగ: తిప్పలవలసలో..

అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు

డెంకాడ: మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికలు చెదురుమదురు ఘటనలు, ఘర్షణలు మినహా ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని పినతాపురం, మహంతిపేట, డెంకాడ, పినతాడివాడ, బేతనాపల్లి బెల్లం, మోదువలస గ్రామాల్లోని ఇరుపార్టీల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మోపాడ గ్రామంలో ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ● **మెంటాడ:** మండలంలో ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సాయంత్రం 6గంటలకే చిన్న గ్రామాల్లో పోలింగ్ ముగియగా, మెంటాడ, ఆంద్ర వంటి పెద్ద పంచాయతీల్లో ఎనిమిది గంటల వరకు కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఓటర్లు ఎండలో ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన ఓ మాదిరి వర్షం కురవడంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ● **రామభద్రపురం:** మండలంలో సుమారు 72 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. చిన్న చిన్న సంఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కొట్టక్కిలో రాత్రి 7.30 గంటల వరకు ఓటర్లు క్యూలో నిలబడ్డారు. కొన్ని గ్రామాల్లో వర్షం కారణంగా పోలింగ్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఆరికతోట గ్రామంలో పోలింగ్ సరళిని మాజీ మంత్రి, రీజనల్ కోఆర్డినేటర్-2 సుజయ్‌కృష్ణరంగారావు పరిశీలించారు. ● **గరివిడి:** గరివిడి మండలంలో ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. బీజే పాలెం, కోడూరు తదితర గ్రామాల్లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు వారిని కట్టడి చేశారు. ● **తెర్లాం:** మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి.రాజ్యలక్ష్మి అన్నారు. వెలగవలస, కాగాం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్టు చెప్పారు. ● **గంట్యాడ:** మండలంలోని స్వల్ప ఘటనలు మినహా సోమవారం ప్రశాంతంగా ఎన్నిక జరిగింది. ఉదయం నరవ, నీలావతి, లక్కిడాం, కొండతామరాపల్లి, తదితర గ్రామాల్లో ఈవీఎంలు కాసేపు మొరాయించడంతో పోలింగ్‌కు అంతరాయం కలిగింది. రామవరం, రావివలస, నందాం, బుడతనాపల్లి, గంట్యాడ గ్రామాల్లో స్వల్ప ఘటనలు చోటుచేసుకున్నాయి. సిరిపురం, బుడతనాపల్లి, కరకవలస తదితర గ్రామాల్లో రాత్రి వరకూ పోలింగ్ సాగింది. వర్షం కురవడంతో పలుచోట్ల విద్యుత్ సమస్యకు అంతరాయం ఏర్పడింది. టార్చిలైట్ల వెలుగుతో పోలింగ్ నిర్వహించారు. మండలం వ్యాప్తంగా సుమారు 84 శాతం పోలింగ్ జరిగిందని అధికారులు చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎస్ఐ సురేంద్రనాయుడు ఎప్పటికప్పుడు పరిశీలించారు.

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ రూరల్/ క్రైం/ రింగురోడ్డు: విజయనగరం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా సోమవారం ప్రశాంతంగా జరిగింది. నగరంలోని కొత్తపేట, యాదవ వీధి 140, 146, 62, కేఎల్ పురం, తోటపాలెంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించాయి. కొత్తపేట 143 పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఓటరు ఏ పార్టీకి ఓటు వేశారన్న దానిని బహిర్గతం చేశారన్న ఆరోపణలతో పీఓకి టీడీపీ నాయకులు మురగడావు పార్వతి, నక్కిళ్ల శ్రీని వాసరావు తదితరులు ఫిర్యాదు చేశారు. ఎండ ప్రభావంతో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 వరకూ విజయనగరం నియోజకవర్గంలో పోలింగ్ మందకొడిగా సాగింది. జొన్నగుడ్డి పోలింగు కేంద్రం వద్ద తల్లి, కూతురు, మనవరాలు ఇలా మూడు తరాల వారు కలిసి ఓటు వేయడం విశేషం. అయ్యన్నపేటలో టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ప్రచారం చేసుకొని ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు.

దాడులు అన్యాయం: అదితి

ఉల్లి వీధికి చెందిన టీడీపీ నాయకులు విజయకృష్ణ, సత్యనారాయణలపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడడం అన్యాయమని టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. స్థానిక కార్పొరేటర్ దగ్గర ఉండి ఈవిధంగా చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఇక వీటిని కవర్ చేయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి విలేకరులను దుర్భాషలాడి... వారి సెల్‌ఫోన్లు తీసుకుని, ఫొటోలు డిలీట్ చేయడం దారుణమని అన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

దివ్యాంగుల అవస్థలు

బొబ్బిలి: కాళ్లు, చేతులు కదల్చలేని దివ్యాంగులు, మంచం మీద నుంచి లేవలేని వారికి, 85 ఏళ్లు దాటిన వారికి హోమ్‌ఓటింగ్ అవకాశం కల్పించారు. కానీ స్థానిక అధికారులు దీనిపై సరైన అవగాహన కల్పించకపోవడంతో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు. ● ఇందిరమ్మ కాలనీకి చెందిన జాగాన పూర్ణ అనే యువతి చాలా ఏళ్లుగా మంచానికే పరిమితమైపోయింది. కాళ్లు, చేతులు కదల్చలేని దీనావస్థలో ఆమె ఇబ్బందులు పడుతోంది. 43వ నెంబరు పోలింగ్ కేంద్రంలో ఆమెకు ఓటు హక్కు ఉంది. ఆమెకు ఇంటి వద్దనే ఓటు వేసే అవ కాశం కల్పించాలని తండ్రి శంకరరావు ఫారం-12 సమర్పిం చినప్పటికీ అధికారులు దీనిపై దృష్టి సారించలేదు. ఆమె ఓటు వేసేందుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరాన గల పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లేందుకు తండ్రి శంకరరావు ఎత్తుకుంటూ ఆటోలో తీసుకెళ్లి నరక యాతన పడ్డారు. ● పట్టణంలోని పూల్‌బాగ్‌కు చెందిన నల్ల గుప్తేశ్వరరావు వయస్సు 75 ఏళ్లు. ఆయన నాలుగేళ్లుగా మంచానికి పరిమితమైపోయారు. ఆయనకు కూడా హోంఓటింగ్ అవకాశం కల్పించకపోవడంతో తసంగ వీధిలోని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లేందుకు బంధువులు ఇబ్బందులు పడ్డారు.

రాత్రి 9 గంటల వరకూ

పూసపాటిరేగ: మండలంలో పలు చోట్ల సోమవారం రాత్రి 9గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. చాలా కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించటంతో పోలింగ్ మందకొడిగా సాగింది. తిప్పలవలస, చోడమ్మఅగ్రహారం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఇరువర్గాల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. ఎండవేడిమి ఎక్కువగా ఉండటంతో కొందరు స్పృహ తప్పి పడిపోవటంతో అక్కడ ఆరోగ్యశాఖ వారు చికిత్సలు నిర్వహించారు. మండలంలోని కొన్ని కేంద్రాల్లో రాత్రి 9గంటలకు సుమారు 90శాతం పోలింగ్ నమోదయ్యింది. రాత్రి 8గంటలు దాటినా మండలంలో కుమిలి, చౌడవాడ, చల్లవాని తోట, పూసపాటిరేగలతో పాటు పలు కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఉన్నారు.

గంటల తరబడి నిరీక్షణ

శృంగవరపుకోట రూరల్/జామి: ఎస్.కోట, జామి మండలాల్లోని దాదాపు అన్ని ప్రాంతాల్లో అరగంట నుంచి గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఎస్.కోట మండలం పోతనాపల్లి, రేవళ్లపాలెం, జామి మండలంలోని లోట్లపల్లి, జాగరం తదితర ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పాటు సాంకేతిక కారణాలతో ఇబ్బంది పెట్టడంతో ఓటర్లు గంటల తరబడి నిరీక్షించారు. జామిలో వృద్ధులు, దివ్యాంగులకు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో పోలింగ్ అధికారులపై మండిపడ్డారు. సాయంత్రం ఆరు గంటల తరువాత ఉరుములతో కూడిన వర్షం మొదలైనా అనేక మంది క్యూలోనే ఉన్నారు. జామి మండలం జాగరం గ్రామంలో రాత్రి ఎనిమిది గంటలైనా మహిళా ఓటర్లు వర్షంలో వేచి ఉన్నారు.

మా డబ్బులు ఏం చేశారు?

బొబ్బిలి: పట్టణంలో పోలింగ్ ముందు రోజు అర్ధరాత్రి దాటిన తరువాత తెల్లవారు జాము వరకు హైడ్రామా కొనసాగింది. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జిల ఇళ్లను పెద్దసంఖ్యలో స్థానిక ఓటర్లు చుట్టుముట్టి తమ డబ్బుల కోసం గట్టిగా నిలదీశారు. ఓటర్లకు పంపిణీ చేయాల్సిన డబ్బులను కొంతమంది నాయకులు తమ వద్దనే ఉంచుకోవడంతో వార్డుల్లోని జనం కోపోద్రిక్తులయ్యారు. వారికి సమాధానం చెప్పుకోలేక కొంతమంది అధికార పార్టీ నాయకులు ముఖం చాటేసినట్లు ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. ఓ మహిళా నాయకురాలి నిర్వాకంపై గట్టిగా నిలదీశారు.

దేవర ఉత్సవానికి చాటింపు

విజయనగరం రూరల్: పైడిమాంబ దేవర ఉత్సవానికి సంప్రదాయబద్ధంగా సోమవారం సాయంత్రం చాటింపు వేశారు. రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి నుంచి మూడు లాంతర్లు వద్ద ఉన్న చదురుగుడికి పైడిమాంబను తీసుకురావడమే దేవర ఉత్సవం ముఖ్య ఉద్దేశం. అక్టోబరు నెలలో జరిగే పైడిమాంబ సిరిమానోత్సవానికి దేవర ఉత్సవం నాంది వంటిది. ఆలయ ఈవో డీవీవీ ప్రసాద్‌రావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, పూజారి బంటుపల్లి వెంకటరావు తదితరులు తొలుత చదురుగుడి వద్ద సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత కోట శక్తి వద్ద నిర్వహించారు. పైడిమాంబకు ప్రత్యేక పూజలు చేశారు.



దేవర ఉత్సవానికి చాటింపు వేస్తున్న దృశ్యం

సెల్‌లైట్ వెలుగులో..

చీపురుపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నాటి పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొన్ని చోట్ల ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించి నప్పటికీ, అధికారులు ఆ సమస్యల్ని వెంటనే పరిష్కరించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో కొద్దిపాటి వర్షపు జల్లులు కురవడం తో, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలింగ్ స్టేషన్లలో చీకట్లు కమ్ముకోవడంతో, ఎన్నికల సిబ్బంది సెల్ లైట్ల వెలుగులో విధులు నిర్వహించాల్సి వచ్చింది.

ఓటింగ్ సరళి పరిశీలించిన కళా

చీపురుపల్లి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు సందర్శించి, ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ కూడా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, పార్టీ నాయకులు గద్దే బాబూరావు, కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రాత్రి ఏడు దాటినా..

చీపురుపల్లి నియోజకవర్గంలో సాయంత్రం 6గంటలకు 76.58 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఇది ఇలా ఉండగా, చీపురుపల్లి మండలంలోని పుర్రేయవలస, గుర్ల మండలంలోని నడుపూరు, కెల్ల, కొండగండ్రేడు తదితర గ్రామాల్లో రాత్రి ఏడు గంటలు దాటాక కూడా పోలింగ్ కొనసాగింది. వందలాది మంది ఓటర్లు క్యూలైన్లో వేచి ఉన్నారు. కాగా, ఎస్పీ ఎం.దీపిక చీపురుపల్లిలో పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి ఆధ్వర్యంలో సీఐ సీహెచ్ షణ్ముఖరావు, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, ఇతర సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎస్.కోటలో బారులు తీరిన ఓటర్లు

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణ పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి ఓటర్లు క్యూ కట్టారు. మందకొడిగా పోలింగ్ జరగడంతో ఓటర్లు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. శ్రీనివాస కాలనీలో 1230 ఓట్లకు గాను సాయంత్రం 5.50 గంటల వరకు 690 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. పోలింగ్ సమయం ముగిసిన తరువాత కూడా 250 నుంచి 300 మంది వరకు క్యూలో నిలుచున్నారు. మరికొన్ని బూత్‌లలోనూ 100 నుంచి 150 మంది క్యూలో ఉన్నారు. సాయంత్రం 6.10 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో గాలి వాన వచ్చింది. దీంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. పోలింగ్‌కు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల బూత్ వద్ద పోలీసులకు, ఓటేసేందుకు వచ్చిన వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలిత కుమారి పట్టణ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ఓటు వేస్తే ఉచితంగా క్షవరం

కొత్తవలస: 'ఓటు వేస్తే క్షవరం ఉచితం. ఓటేసిరండి... నా సెలూన్ షాపులో ఉచితంగా కటింగ్ చేయించుకోండ'ని ఆఫర్ ఇచ్చారు ఆ షాపు యజమాని. కొత్తవలస రైల్వే స్టేషన్ సమీపంలోనున్న సెలూన్ షాపు యజమాని ప్రసాద్ ఓట్ల శాతాన్ని పెంచడానికి ఈ ఆఫర్ ఇచ్చినట్టు వెల్లడించాడు. మండలంలో ఎవరైనా ఓటు వేసినట్టు చూపుడు వేలుకు సిరా గుర్తుతో పాటు మండలానికి చెందిన వ్యక్తేనని తెలిపే గుర్తింపు కార్డు చూపిస్తే మంగళవారం ఉచితంగా తన సెలూన్ షాపులో కటింగ్ గానీ, షేవింగ్ గానీ చేస్తానని ప్రకటించాడు.

చంద్రబాబు పాలన రావడం ఖాయం

రాజాం/వంగర: ప్రజలు సోమవారం ఇచ్చిన తీర్పుతో రాష్ట్రంలో చంద్రబాబు పాలన రావడం ఖాయమని కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం సారథి రోడ్డులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసీపీ నాయకులు గెలవలేమన్న భయంతో చాలా దగ్గర్ల అల్లర్లు సృష్టించాలని ప్రయత్నించారని, దానిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అడ్డుకున్నారని విలేకరులతో చెప్పారు. వంగర మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆయన సతీమణి శ్రీలక్ష్మి, వైసీపీ అభ్యర్థి రాజేష్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐఆర్ఎస్ అధికారిణి, సెంట్రల్ ఫైనాన్సియల్ కంట్రోలర్ జనరల్ ప్రియాంక నాషిణ్ రేగిడి మండలం ఆడవరం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

వర్షంలో నిరీక్షణ

బొండపల్లి: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కనిమెరక, బోడసింగిపేట, దేవుపల్లి, ఎం.కొత్తవలస గ్రామాల్లో ఈవీఎంలు గంటలపాటు మొరాయించడంతో ఓటర్లు పలు అవస్థలు పడ్డారు. దేవుపల్లి గ్రామంలో 122 నెంబర్ పోలింగ్ బూత్‌లో 2 గంటలపాటు ఈవీఎం మొరాయించడంతో వందలమంది సాయంత్రం 7 గంటల వరకు భారీ వర్షంలో నిరీక్షించాల్సి వచ్చింది. దివ్యాంగులు, వృద్ధులు ఓటు వినియోగించుకునేందుకు పలు అవస్థలు పడాల్సి వచ్చింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ కసిరెడ్డి లక్ష్మణరావు సిబ్బందితో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ సాగేలా కృషి చేశారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

కొత్త జంట కోరుకునే పెళ్లి కానుక
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి లో
వివాహ ప్రకటన ఇవ్వటం ద్వారా మీ ప్రతిష్ఠను పెంచుకోండి. నవీన రీతిలో ఆహ్వానించి బంధుమిత్రులను అలరించండి
- శుభాకాంక్షలు
- ధన్యవాదాలు
- వివాహ ఆహ్వానాలు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనలకు సంప్రదించండి
99854 11066